

# హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ భేష్

- సిబ్బంది సేవల్లో మొదటి స్థానం
- నాలుగోసారి దక్కిన గౌరవం

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు ప్రతిష్ఠాత్మక అవార్డును గెలుచుకుంది. 2025 సంవత్సరానికి దక్షిణాసియా, భారత్‌లో అత్యుత్తమ విమానాశ్రయ సిబ్బంది సేవ అవార్డును నాలుగోసారి దక్కించుకుంది. వాయు రవాణా రేటింగ్ సంస్థ స్కైట్రాక్స్ ప్రపంచంలోని అత్యుత్తమ ఎయిర్‌పోర్టులను ఎంపిక చేయగా దానిని స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరిగిన ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో 2025లో ప్రకటించి, అందజేశారు. ఈ సందర్భంగా తమకు ఈ అవార్డు రావడం పట్ల జీఎంఆర్ యాజమాన్యం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. పౌరుల ప్రయాణం సాఫీగా, సౌకర్యవంతంగా సాగేలా విమానాశ్రయ సిబ్బంది చేసిన కృషిని ఈ అవార్డు ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ప్రయాణికుల సౌకర్యం కోసం విమానాశ్రయంలో అనేక కేంద్రీకృత ఆవిష్కరణలను అమలు చేసినట్టు తెలిపింది. నగరం వైపు చెక్-ఇన్, వేచి ఉండే సమయాన్ని తగ్గించే డిజిటల్ పరిష్కారాలు అమలు చేస్తున్నట్టు వివరించింది. సౌకర్యవంతమైన లాంజ్‌లు, విభిన్న భోజన, షాపింగ్ ఎంపికలు ఉన్నాయని తెలిపింది. ప్రత్యేక అవసరాల ప్రయాణికులకు సహాయం చేయడానికి శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నట్టు తెలిపింది.

**ఉత్తమ విమానాశ్రయంగా సింగపూర్ ఎయిర్‌పోర్టు**

2025 ఏడాదికి ప్రపంచంలోనే ఉత్తమ విమానాశ్రయంగా సింగపూర్ చాంగీ ఎయిర్‌పోర్టు మొదటి స్థానంలో, దోహాలోని హమద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రెండో స్థానంలో నిలిచాయి. మొదటి 20 స్థానాలలో భారత్‌కు చోటు దక్కలేదు. అయితే దక్షిణాసియా, భారత్‌లో ఢిల్లీ విమానాశ్రయం అత్యుత్తమ ఎయిర్‌పోర్టు క్యాటగిరీలో టైటిల్ గెల్చుకుంది. దక్షిణాసియా, భారత్‌లో అత్యుత్తమ ప్రాంతీయ విమానాశ్రయంగా బెంగళూరు, ఐదు మిలియన్ల లోపు ప్రయాణికుల క్యాటగిరీలో అత్యుత్తమ ఎయిర్‌పోర్టుగా గోవాలోని మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఎంపికైంది

### ఈడీకి ప్రాథమిక హక్కులుంటే..

# ప్రజలకూ ఉంటాయ్

### కేంద్ర దర్యాప్తు సంస్థకు సుప్రీంకోర్టు చురకలు

న్యూఢిల్లీ: తనకు ప్రాథమిక హక్కులు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) భావించిన పక్షంలో ప్రజలకు కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయని ఈడీ గ్రహించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నాగరిక్ అపూర్తి నిగం(ఎన్ఏఎన్) స్కామ్ కేసును ఛత్తీస్‌గఢ్ నుంచి న్యూఢిల్లీకి బదిలీ చేయాలని కోరుతూ ఈడీ వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పౌరుల కోసం ఉద్దేశించిన రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద రిట్ పిటిషన్‌ను ఈడీ ఎలా దాఖలు చేసిందని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ప్రశ్నించింది. రాజ్యాంగపరమైన పరిష్కారాలు పొందే హక్కును 32వ అధికరణ పౌరులకు కల్పిస్తుంది. తమ ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే ప్రజలు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి ఊరట పొందవచ్చు. ధర్మాసనం వ్యాఖ్యలకు స్పందించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తమ పిటిషన్‌ను ఉపసంహరించడానికి అనుమతి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఈడీకి కూడా ప్రాథమిక హక్కులు ఉంటాయంటూ రాజు చేసిన వ్యాఖ్యలపై ధర్మాసనం వెంటనే ప్రతిస్పందిస్తూ ప్రజలకు కూడా ప్రాథమిక హక్కులు ఉన్నాయని ఆలోచించాలని చురకలు అంటించింది.

# ఏ టూ జెడ్.. చార్జీల మోత

- వరుసగా రేట్లను పెంచుతున్న కర్ణాటక కాంగ్రెస్ సర్కారు
- అధికారంలోకి వచ్చిన రెండేండ్లలో మోయలేని భారం
- మండిపడుతున్న పౌరులు.. ఆందోళనకు సిద్ధమైన విపక్షాలు




బెంగళూరు, ఏప్రిల్ 11: ఎడాపెడా హామీలిచ్చి కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండేళ్లు కూడా పూర్తికాక ముందే ప్రజాగ్రహాన్ని మూటకట్టుకుంటున్నది. ఆల్కహాల్ నుంచి వాటర్ చార్జీల వరకూ అన్నింటి రేట్లను ఎడాపెడా పెంచేసి సామాన్యుల నడ్డి విరుస్తున్నది. ఈ ధరల భారానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించేందుకు విపక్ష బీజేపీ, జేడీ(ఎస్)లు సిద్ధమవుతున్నాయి. 2023 మేలో జరిగిన ఎన్నికల్లో కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌కు 135 సీట్లతో (మొత్తం 224) పూర్తి మెజారిటీలో అధికారాన్ని అప్పగించారు. ఈ రెండేళ్ల వ్యవధిలో సిద్ధూ సర్కార్, డీజిల్, విద్యుత్, మెట్రో, ఆర్టీసీ, ప్రైవేట్ బస్ చార్జీలు, పాలు, పెరుగు, నీటి బిల్లులు, ఆఖరికి చెత్త చార్జీలు కూడా దారుణంగా పెంచేసి ప్రజలపై అదనపు భారం వేసింది. ఇప్పటికే ద్రవ్యోల్బణం కారణంగా కిందా మీదా అవుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు ఈ పెంచిన ధరలను తట్టుకోలేకపోతున్నారు.

**కాంగ్రెస్‌ది ధరల పెంపు గ్యారెంటీ**

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు బదులు కాంగ్రెస్ 'ధరల పెంపు గ్యారెంటీ'ని అమలు చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆరోపించారు. నిత్యావసరాల ధరల పెంపు, ప్రభుత్వ టెండర్లలో ముస్లింలకు రెండు శాతం రిజర్వేషన్లు ఇవ్వడం చూస్తుంటే కాంగ్రెస్ దుష్పరిపాలన ఎలా వుందో అర్థమవుతున్నదని ఆరోపిస్తూ బీజేపీ 16 రోజుల 'జనాక్రోశ' ఆందోళనను ప్రారంభించింది. కాగా, రాష్ట్రంలో పెరుగుతున్న ధరలు, పెచ్చుమీరుతున్న అవినీతిని నిరసిస్తూ 'ఇక చాలు కాంగ్రెస్' పేరుతో ఈ నెల 12న బెంగళూరు ఫ్రీడమ్ పార్కు వద్ద ఆందోళన నిర్వహించనున్నట్టు జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. పెంచిన డీజిల్ ధరను తగ్గించాలని, హైవేలపై చెక్‌పోస్టులు తొలగించాలని, పెంచిన టోల్ చార్జీలు తగ్గించాలని ఈ నెల 15 నుంచి నిరవధిక ఆందోళన చేయనున్నట్టు కర్ణాటక రాష్ట్ర లారీ ఓనర్స్, ఏజెంట్స్ అసోసియేషన్ ప్రకటించింది.

**అవినీతిలో బీజేపీని మించి.. సిద్ధరామయ్య సర్కార్‌పై కాంట్రాక్టర్ల ధ్వజం**

కర్ణాటక రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ మరోసారి అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసింది. ప్రభుత్వ శాఖల్లో ఇతరుల జోక్యం ఎక్కువైందని ఆరోపిస్తూ సిద్ధరామయ్య నేతృత్వంలోని మంత్రుల బంధువులపై నేరుగా ఆరోపణలు గుప్పించింది. కాంగ్రెస్ పాలనలో అవినీతి తారస్థాయికి చేరుకుందని, వారు గత బీజేపీ పాలకుల కన్నా దారుణంగా వ్యవహరిస్తున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు డీ మంజునాథ్ ఆరోపించారు. గత బీజేపీ ప్రభుత్వం కన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ శాతం లంచాలను డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. ఈ విషయం తాము సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్‌ల దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామని, అయినా ప్రయోజనం శూన్యమని అన్నారు. చిన్ననీటిపారుదల శాఖ మంత్రి బోస్ రాజు కుమారుడు , పీడబ్ల్యూడీ శాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి అల్లుడు బిల్లుల మంజూరులో జోక్యం చేసుకుంటున్నారన్నారు. వెంటనే కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌కు ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే ఈ అక్రమాల్లో పాత్రధారులందరి పేర్లు బయట పెడతామని ఆయన హెచ్చరించారు.




- **A** ఆల్కహాల్: మద్యంపై 20%, బీరుపై 10% పన్ను పెంపు
- **B** బస్సు చార్జీలు: కేఎస్ఆర్టీసీ, బీఎంటీసీలపై 15% పెంపు.
- **C** క్యాబ్స్: ఆటోలు, ఇతర వాణిజ్య వాహనాలపై 3% రవాణా పన్ను.
- **D** డీజిల్ ధర: 2025 ఏప్రిల్ నుంచి లీటర్‌కు రూ.2 పెంపు.
- **E** ఎలక్ట్రిసిటీ: యూనిట్ ధర 36 పైసలు, ఫిక్స్‌డ్ చార్జీలు పెంపు.
- **F** ఫ్యూయల్: 2024 జూన్ నుంచి పెట్రోల్, డీజిల్ ధర లీటర్‌కు రూ.3 పెంపు.
- **G** గైడెన్స్ విలువ: ఆస్తులపై 15–30% పెంపు.
- **H** హచ్‌బ్యాక్, లగ్జరీ క్యాబ్ చార్జీలు పెంపు
- **I** ఇండస్ట్రీ హిట్: డీజిల్, విద్యుత్, నీటి ధరల పెంపు.
- **J** జర్నీ: ప్రైవేట్, ప్రభుత్వ బస్సు చార్జీల పెంపుతో ప్రయాణం భారం.
- **K** కర్ణాటక ఓకేస్: ప్రైవేట్ కాలేజీల ఫీజు పెంపు.
- **L** లైఫ్‌టైం ట్యాక్స్: 25 లక్షల పైబడి విలువున్న ఈవీలపై 10% పన్ను.
- **M** మెట్రో: రైలు చార్జీలు 71% వరకు పెంపు.
- **N** నందిని: పాలు, పెరుగు లీటర్‌కు రూ.4 పెంపు.
- **O** ఓటీటీ: సినిమా టికెట్లపై 2% అదనపు సెస్.
- **P** పార్కింగ్: బెంగళూరులో వాణిజ్య, నివాస ప్రాంతాలలో చార్జీలు పెంపు.
- **Q** క్వారీ: ఫీజు పెంపు.. తద్వారా అధికమైన నిర్మాణాల భారం.
- **R** రెంటల్: అగ్రిమెంట్లపై స్టాంప్ డ్యూటీ 200–500 శాతం పెంపు
- **S** సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్: పన్ను ఆస్తిపన్నుకు జత.
- **T** టోల్: ఎయిర్‌పోర్టు రోడ్ సహా హైవేలపై 3–5 శాతం చార్జీల పెంపు.
- **U** యూనియన్ గవర్నమెంట్: ఎల్పీజీపై రూ.50 పెంచిన కేంద్రం
- **V** వెహికల్: రిజిస్ట్రేషన్ చార్జీ రూ.500–1000 అదనం.
- **W** వాటర్: చార్జీలు పెంపు (బెంగళూరులో).
- **X** ఎక్స్‌రే: ఓపీడీ, ల్యాబ్ చార్జీలు 50–100 శాతం పెంపు.
- **Y** యువర్ బడ్జెట్: కూరగాయలు, పండ్లు, స్కూల్ ఫీజుల పెంపు, జాతీయ సగటు (3.61) కన్నా రాష్ట్ర ద్రవ్యోల్బణం (4.49 శాతం) అధికం.
- **Z** జొమాటో, అమెజాన్, ర్యాపిడో, ఇతరులపై గిగ్ వర్కర్ల ఫండ్ కోసం 5% సుంకం విధింపు.

### వందలాది ఉద్యోగులపై

## గూగుల్ వేటు!

### ఆండ్రాయిడ్, పిక్సెల్ విభాగాల్లో భారీగా తొలగింపులు

న్యూఢిల్లీ: సెర్చింజన్ దిగ్గజం గూగుల్ వందలాది మంది ఉద్యోగులపై వేటు వేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆండ్రాయిడ్, పిక్సెల్ స్మార్ట్ ఫోన్స్, క్రోమ్ బ్రౌజర్ బృందాలు పనిచేస్తున్న ప్లాట్‌ఫామ్స్, డివైజెస్ యూనిట్లలో ఉద్యోగులను తొలగిస్తున్నట్టు రాయిటర్స్ నివేదిక వెల్లడించింది. నిరుడు కొన్ని ప్లాట్‌ఫామ్స్, డివైజ్ టీమ్‌లను కలిపేశాక సేవల సామర్థ్యం పెంచడం కోసం శ్రామిక శక్తిని తగ్గిస్తున్నారు. ఉద్యోగాల కోతలపై గూగుల్ అధికార ప్రతినిధి స్పందిస్తూ.. ఆ ప్రక్రియను వేగంగా, ప్రభావవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుడు చేపట్టిన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చర్యలకు ప్రస్తుతం చేపడుతున్న ఉద్యోగాల తగ్గింపు అదనమని తెలిపారు.

## అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు

### వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ

చెన్నై: 2026లోజరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ కలిసి పోటీ చేస్తాయని కేంద్ర హోం మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు అమిత్ షా శుక్రవారం ప్రకటించారు. 1998 నుంచి అన్నాడీఎంకే ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షమని, మాజీ ముఖ్యమంత్రి జే జయలలిత, ప్రధాని మోదీ గతంలో కలిసి పనిచేశారని ఆయన గుర్తు చేశారు. తమ కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఈపీఎస్ ఉంటారని స్పష్టం చేశారు.

**తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా నైనార్ నాగేంద్రన్!**

తమిళనాడు బీజేపీ నూతన అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు, శాసనసభ్యుడు నైనార్ నాగేంద్రన్ ఎంపికయ్యారు. ఆయన ఎంపికను బీజేపీ నాయకత్వం ఏకగ్రీవంగా ఆమోదించింది. నయనార్ నాగేంద్రన్ ఎంపికపై శనివారం అధికారికంగా ప్రకటన వెలువడనున్నది. 2017లో నాగేంద్రన్ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు.

## వలస కూలీకి రూ.314 కోట్ల ఐటీ నోటీసు

ముంబై, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో ఓ కూలీకి ఆదాయపు పన్ను శాఖ నుంచి రూ.314 కోట్ల పన్ను నోటీసు అందింది. అసలే ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉన్న సమయంలో ఆదాయపు పన్ను శాఖ కోట్లాది రూపాయల నోటీసు పంపడంతో ఆ వలస కూలీ అస్వస్థతకు గురయ్యాడు. ప్రస్తుతం అతను దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. చంద్రశేఖర్ పండిట్ రావు కోహడ్ కొన్ని రోజులుగా నాగ్‌పూర్‌లో నెలకు రూ.15 వేలకు కూలీగా పని చేస్తున్నాడు.

### అయ్యప్ప స్వామి బొమ్మతో

## బంగారు లాకెట్లు

### ఆన్‌లైన్‌లో, శబరిమల ఆలయం వద్ద అమ్మకాలు


శబరిమల: మలయాళ నూతన సంవత్సరం విషు పర్వదినం సందర్భంగా ఈ నెల 14 నుంచి స్వామి అయ్యప్ప బొమ్మతో బంగారు లాకెట్లు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు వివరాల ప్రకారం, 1, 2, 4, 8 గ్రాముల బరువు గల బంగారు లాకెట్లను www.sabarimalaonline.org ద్వారా ఆన్‌లైన్‌లోనూ, శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద విక్రయిస్తారు. ఈ లాకెట్లను అయ్యప్ప స్వామి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేసి, అమ్ముతారు.

## 30 నుంచి చార్‌ధామ్ యాత్ర

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్ర ఈ నెల 30 నుంచి ప్రారంభమవుతుంది. భక్తులు యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను సందర్శిస్తారు. గంగోత్రి, యమునోత్రి ఆలయాలను ఈ నెల 30 నుంచి, కేదారనాథ్‌ను వచ్చే నెల 2 నుంచి, బద్రీనాథ్‌ను వచ్చే నెల 4 నుంచి భక్తుల కోసం తెరుస్తారు. భక్తులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకోవచ్చు. డెహ్రాడూన్, హరిద్వార్, గుప్త కాశి, సోన్‌ప్రయాగ్ తదితర నగరాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో కూడా భక్తులు నమోదు చేయించుకోవచ్చు.

# అనిశ్చితిలో అమెరికా చదువు!

- ఓపీటీ రద్దయితే అక్కడ ఉన్నత చదువు భారం
- 28% తగ్గిన భారతీయ విద్యార్థుల నమోదు




న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులలో అనిశ్చితి నెలకొంటోంది. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) ప్రోగ్రామ్‌ను రద్దు చేయాలని కోరుతూ అమెరికన్ కాంగ్రెస్‌లో కొత్త బిల్లును ప్రవేశపెట్టిన నేపథ్యంలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మార్చి నాటికి అమెరికాలో చదువుకుంటున్న భారతీయుల సంఖ్య 28 శాతం క్షీణించింది. అంతర్జాతీయ విద్యార్థులు ప్రత్యేకంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్(స్టెమ్) కోర్సుల్లో చదువుకుంటున్న విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఉద్యోగాన్వేషణ కోసం మూడేళ్లపాటు అమెరికాలో నివసించేందుకు ఓపీటీ ప్రోగ్రామ్ అనుమతిస్తుంది. అయితే ఓపీటీని రద్దు చేయాలని కోరుతూ ఫెయిర్‌నెస్ ఫర్ హై స్కిల్డ్ అమెరికన్ యాక్ట్ 2025 పేరిట కొత్త బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.

**తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..**

గత ఏడాది జూలై నుంచి క్రమంగా భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నట్టు స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(సెవీస్) డాటా సూచిస్తోంది. 2024 జూలైలో 3,48,446 మంది భారతీయులు అమెరికాలో విద్యనభ్యసిస్తుండగా 2024 ఆగస్టు నాటికి ఈ సంఖ్య 2,55,447కి తగ్గింది. ఈ ఏడాది మార్చి వరకు ఈ సంఖ్య 2.55 లక్షలుగా కొనసాగింది. గత ఏడాది వరకు భారతీయ విద్యార్థుల నమోదు క్రమంగా పెరుగుతూ పోగా ఇప్పుడది తగ్గుతూ వస్తోంది. 2025 విద్యా సంవత్సరానికి భారతీయ విద్యార్థుల నమోదు 28 శాతం తగ్గడానికి వీసా జారీలో అనిశ్చితి, ప్రతిపాదిత ఓపీటీ ప్రోగ్రామ్ రద్దు, ట్యూషన్ ఖర్చుల పెరుగుదల వంటివి కారణాలని స్టెప్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సిద్ధార్థ్ అయ్యర్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సంలో 97,556 మంది భారతీయ విద్యార్థులు ఓపీటీ ప్రోగ్రామ్‌లో పాల్గొన్నారని ఆయన వివరించారు. ఈ విద్యా సంవత్సరంలో అది రద్దయిన పక్షంలో ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక స్థిరత్వంపై విద్యార్థులలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయని ఆయన తెలిపారు. రూపాయి విలువ తగ్గుదలతో విద్యార్థులకు ఖర్చులు పెరిగిపోయాయని, అమెరికాలో చదువు ఖర్చులు సంవత్సరానికి 25,000 డాలర్ల నుంచి 45,000 డాలర్ల వరకు ఉంటాయని, దీంతో భారతీయ కుటుంబాలు అమెరికన్ చదువులను భరించలేని పరిస్థితి తలెత్తిందని సిద్ధార్థ్ అయ్యర్ పేర్కొన్నారు.

## ట్రంప్‌పై అమెరికా వర్సిటీల న్యాయపోరు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ విధానాలపై న్యాయ పోరాటం ప్రారంభమైంది. ప్రొఫెసర్లు, విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు దీనిలో భాగస్వాములయ్యాయి. విద్యార్థుల వీసాల రద్దు, అరెస్టులు చేయడం, కొన్ని విద్యా సంస్థలను డీసర్టిపై చేస్తామని బెదిరించడం వంటి చర్యల వల్ల అమెరికన్ విశ్వవిద్యాలయాలు, కళాశాలల పట్ల భయానక వాతావరణం ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశాయి. అమెరికన్ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల సంఘం దాఖలు చేసిన ఈ దావాకు ప్రెసిడెంట్స్ అలయెన్స్ ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ ఇమిగ్రేషన్, 86 సంఘాలు, విద్యా సంస్థలు మద్దతు పలికాయి. ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ చర్యలను కొనసాగనివ్వరాదని అన్నారు. అమెరికన్ ఆర్థిక, విద్యా వ్యవస్థలను ట్రంప్ విధానాలు సర్వనాశనం చేస్తున్నాయని ప్రెసిడెంట్స్ అలయెన్స్ వాదించింది.



## డజను గుడ్లు రూ.536!

### అమెరికాలో కొండెక్కిన ధరలు

వాషింగ్టన్: అమెరికాలో గుడ్ల ధరలు చూసి ప్రజలు గుడ్లు తేలేస్తున్నారు. మునుపెన్నడూ లేని రీతిలో అక్కడ ఎగ్స్ ధరలు రికార్డు స్థాయికి చేరాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో 60.4 శాతం పెరుగుదల కనిపించింది. ప్రస్తుతం డజను గుడ్ల ధర 6.22 డాలర్లు (సుమారు రూ.536)గా ఉంది. ఏవియన్ ఫ్లూ లక్షణాలు కనిపించిన వెంటనే లక్షలాది కోళ్లను చంపేశారు. దీంతో ఇప్పుడు గుడ్లను పెట్టే కోళ్లు తగ్గిపోయాయి. జనవరిలో డజను గుడ్ల ధర 4.95 డాలర్లు కాగా, ఫిబ్రవరిలో 19.2 శాతం పెరిగి 5.90 డాలర్లకు చేరింది. 2024వ సంవత్సరం ప్రారంభం నాటి ధరతో పోల్చుకుంటే ఇప్పుడు 84 శాతం పెరుగుదల నమోదైంది. 2023 జనవరిలో డజను గుడ్ల ధర రికార్డు స్థాయిలో 4.82 డాలర్లకు చేరగా, ఇప్పుడు ఆ రికార్డు చెరిగిపోయింది.

## వాట్సాప్ ఇమేజ్ స్కామ్!

### సైబర్ నేరగాళ్ల నయా మోసం

న్యూఢిల్లీ: సైబర్ మోసాల కోసం నేరగాళ్లు ఇటీవల ఎక్కువగా వాట్సాప్‌ను ఉపయోగిస్తున్నారు. తాజాగా ఇమేజ్ స్కామ్ పేరుతో కొత్త మోసానికి తెర లేపారు. ఈ స్కామ్ బారిన పడి జబల్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల భారీగా డబ్బు పోగొట్టుకున్నారు. స్టెగానోగ్రఫీ సాంకేతికత సాయంతో స్కామర్లు ఈ మోసానికి పాల్పడతారు. ప్రమాదకరమైన కోడ్ కలిగిన ఇమేజ్ కోడ్‌ను మన వాట్సాప్‌కు పంపిస్తారు. ఈ ఇమేజ్‌ను తెరిస్తే.. మాల్‌వేర్ దానంతట అదే ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయి సున్నిత సమాచారాన్ని గ్రహిస్తుంది. స్కామ్ బారిన పడకుండా ఉండాలంటే.. తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫొటో, వీడియో లేదా లింక్‌లను తెరవకూడదు. వాట్సాప్ సెట్టింగ్స్‌లో ఆటో డౌన్‌లోడ్ ఫీచర్‌ను ఆఫ్ చేయాలి.

# ఈవీఎంల హ్యాకింగ్ సాధ్యమే!

### అమెరికా మళ్లీ పేపర్ బ్యాలట్‌కు మళ్లాలి

### ఆ దేశ ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబ్బర్డ్ వ్యాఖ్యలు



వాషింగ్టన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను(ఈవీఎం) హ్యాకింగ్ చేయడం చాలా సులభమని, మళ్లీ ఎన్నికల్లో బ్యాలట్ పత్రాలను ఉపయోగించడంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బర్డ్ పిలుపునిచ్చారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న క్యాబినెట్ సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈవీఎంల భద్రతా లోపాలను ఆమె ఆధారాలతో సహా ఈ సమావేశంలో నిరూపించారు. 2020 అధ్యక్ష ఎన్నికల సందర్భంగా అప్పటి సైబర్ సెక్యూరిటీ చీఫ్ క్రిస్ క్రెమ్స్ చర్యలపై దర్యాప్తు చేపట్టాలని న్యాయ శాఖను(డీఓజే) ఆదేశిస్తూ పాలనాపరమైన ఉత్తర్వులపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేసిన మరుసటి రోజే ఈ సంచలన వ్యాఖ్యలు వెలువడడం గమనార్హం. చాలా కాలంగా ఈవీఎంలు హ్యాకర్లకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తులసీ గబ్బర్డ్ వెల్లడించారు. పోలైన ఓట్ల ఫలితాలను మార్చడం హ్యాకర్లకు చాలా సులభమని ఆమె అన్నారు. స్పేస్ ఎక్స్ సీఈఓ మస్క్ నిరుడు ఈవీఎంల విశ్వసనీయతపై సందేహం వ్యక్తం చేశారు. ఈవీఎంలను నిర్మూలించాలని కోరారు.

**మన ఈవీఎంలు సురక్షితం: ఈసీ**

భారత్‌లో ఉపయోగించే ఈవీఎంలను హ్యాకింగ్ చేయడం సాధ్యమేనంటూ వస్తున్న ఆరోపణలను కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు శుక్రవారం తోసిపుచ్చాయి. మన దేశ ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎంలు సాధారణ కాలిక్యులేటర్ తరహాలో పనిచేస్తాయని, ఈవీఎంలను ఇంటర్నెట్ లేదా ఇన్ఫ్రారెడ్‌కు అనుసంధానించడం లేదని ఈసీ అధికారులు వివరించారు.

## నదిలో కూలిన హెలికాప్టర్.. సిమెన్స్ సీఈవో దుర్మరణం



వాషింగ్టన్: అమెరికాలోని హడ్సన్ నదిలో హెలికాప్టర్ కూలిన ప్రమాదంలో టెక్ దిగ్గజ కంపెనీ సిమెన్స్ సీఈవో అగస్టీన్ ఎస్కోబార్ దుర్మరణం చెందారు. మన్‌హట్టన్–న్యూజెర్సీ మధ్యలో గురువారం మధ్యాహ్నం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గింగిరాలు కొడుతూ నదిలో కూలిపోయింది. అగస్టీన్ కుటుంబ సమేతంగా న్యూయార్క్ నగర పర్యటనకు వచ్చినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో అగస్టీన్ భార్య, ముగ్గురు పిల్లలు, పైలట్ కూడా మృతి చెందారు. అధికారుల కథనం ప్రకారం.. నలుగురు ఘటనా స్థలిలో మృతి చెందగా, ఇద్దరు దవాఖానలో మరణించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియలేదు.

### జార్జియాలో హిందూ ఫోబియాపై బిల్లు

వాషింగ్టన్: హిందువులపై విద్వేషపూరిత దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, హిందూఫోబియాను అధికారికంగా గుర్తిస్తూ ఓ బిల్లును అమెరికాలోని జార్జియా స్టేట్ ప్రవేశపెట్టింది. దీంతో హిందూఫోబియాను గుర్తించిన తొలి అమెరికా రాష్ట్రంగా జార్జియా నిలిచింది. ఈ బిల్లుకు ఆమోదం లభించి, చట్టంగా మారితే, జార్జియా పీనల్ కోడ్‌ను సవరిస్తారు. అనంతరం దర్యాప్తు సంస్థలు హిందూఫోబియా, హిందువుల పట్ల వివక్ష, విద్వేషపూరిత నేరాలపై చర్యలు చేపట్టడానికి వీలవుతుంది. జార్జియా జనరల్ అసెంబ్లీలో ఈ నెల 4న ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు స్పాన్సర్లుగా డెమోక్రాట్లు, రిపబ్లికన్లు ఉన్నారు. కొయలిషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా స్పందిస్తూ, ఈ బిల్లుకు మద్దతిచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపింది.

### ప్రమాదం జరిగినా పట్టించుకోని పాదచారులపై కేసు

బీజింగ్: చైనాలోని షాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో ఎలక్ట్రిక్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికి గురైన వృద్ధునికి సాయపడని వారిపై ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు కేసు పెట్టారు. అయితే, పాదచారులు, సాధారణ ప్రజలు నష్టపరిహారం చెల్లించవలసిన అవసరం లేదని కోర్టు తీర్పు చెప్పింది. సహాయం చేయవలసిన బాధ్యత వారికి లేదని స్పష్టం చేసింది. ఆరోగ్యంగా ఉండే వృద్ధుడు (87) నిరుడు ఎలక్ట్రిక్ సైకిల్‌పై సవారీ చేశారు. ఆయన అకస్మాత్తుగా వీధిలో పడిపోయారు. ఆ తర్వాత ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఆ దారిలో వెళ్తున్నవారు ఆయనను గమనించి వెళ్లిపోయారు. దీనిపై వృద్ధుని కుటుంబ సభ్యులు ఆ దారిన పోతూ, సాయపడని 10 మందిపై కేసు పెట్టారు.

## మృతుల జాబితాలోకి వేలాది వలసదారులు

### అమెరికా నుంచి వెళ్లగొట్టడమే లక్ష్యం

వాషింగ్టన్ : వలసదారులను పెద్ద ఎత్తున అమెరికా నుంచి వెళ్లగొట్టడంలో భాగంగా ట్రంప్ ప్రభుత్వం దాదాపు 6 వేల మంది పేర్లను మృతుల జాబితాలోకి చేర్చబోతున్నది. ఈ ప్రక్రియ గురించి తెలిసిన ఇద్దరు ఓ మీడియా సంస్థకు తెలిపిన సమాచారం ప్రకారం, దాదాపు 6 వేల మంది వలసదారుల సోషల్ సెక్యూరిటీ నంబర్లను రద్దు చేసి, వారు అమెరికాలో పని చేయకుండా, ఎటువంటి సేవలు, ప్రయోజనాలను పొందకుండా చేయడం కోసం సన్నాహాలు జరుగుతున్నాయి. బ్యాంకులు, ఇతర మౌలిక సేవలను పొందాలంటే సోషల్ సెక్యూరిటీ నంబర్లు తప్పనిసరి. సీబీపీ వన్ యాప్‌ను ఉపయోగించే వలసదారుల లీగల్ స్టేటస్‌ను ప్రభుత్వం రద్దు చేసింది.



## బెంగాల్‌లో వక్ఫ్ నిరసనలు హింసాత్మకం

### రైలుపై రాళ్ల దాడి.. రైల్వే స్టేషన్ ధ్వంసం

కోల్‌కతా: ఏప్రిల్ 11: వక్ఫ్ బిల్లుకు నిరసనగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో శుక్రవారం మళ్లీ హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. నింతిటా రైల్వే స్టేషన్‌లో ఆగి ఉన్న రైలుపై రాళ్లతో దాడి చేసిన మూకలు స్టేషన్ ఆస్తిని ధ్వంసం చేశాయి. మూకలు సృష్టించిన విధ్వంసంలో దాదాపు 10 మంది పోలీసులు గాయపడ్డారు. హింసను అదుపు చేసేందుకు సరిహద్దు భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. ఈ ఘటన కారణంగా రెండు రైళ్లు రద్దు కాగా ఐదు రైళ్లను రైల్వే అధికారులు దారి మళ్లించారు. మూకల దాడిలో కొందరు ప్రయాణికులు కూడా గాయపడ్డారు.